జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శుక్రవారం | 3-1-2025 | ఎడిటర్: చౌదరి ప్రమోద్ కుమార్ | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 208 పేజీలు: 4 వెల : రూ.7


# నిబంధనలకు.. పాతర..

✳ ఇచ్ఛాపురంలో పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు ✳ లక్షల్లో టర్నోవర్ ✳ ఇతర ప్రాంతాల నుంచి కూలీలకే ఉపాధి ✳ స్థానికులకు మొండిచేయి ✳ వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్న విమర్శలు ✳ బట్టీ పొగతో శ్వాసకోస వ్యాధుల బారిన స్థానికులు ✳ కోర్టులో కేసు వేసిన బిర్లంగివాసి ✳ నోటీసులకే పరిమితమైన అధికారులు



బట్టీల నుంచి ఎవరెవరికి ఎంతెంత ముడుపులు అందుతున్నది.. సమగ్ర వివరాలతో త్వరలో 'జాతీయ వార్త'లో కథనం

**శ్రీకాకుళం క్రైం, జనవరి2 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సరైన పరిశ్రమలు లేక ఉపాధి దొరక్క కుటుంబ పోషణ నిమిత్తం ఇక్కడి యువత ఇతర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకుని వలస బాట పడుతున్నారు. అయితే ఇతర ప్రాంతాలకు చెందిన వారు మన జిల్లాకు వలస వస్తున్నారు. జిల్లాలో ఎక్కడా లేనటువంటి ఇటుక బట్టీలు ఇచ్ఛాపురంలో 32 వరకూ ఉన్నాయి. బాహుదా నది పరివాహక ప్రాంతంలోనే 21 బట్టీలు ఉన్నాయి. రత్తకన్న, మసాకపురం, బిర్లంగి, ఈదుపురం, పాయితారి, లొద్దపుట్టి, కొలిగాం వంటి ప్రాంతాల్లో ఎక్కువగా బట్టీలను కొందరు ఏర్పాటు చేశారు. వీటి వల్ల చాలామందికి ఉపాధి దొరుకుతుంది. ఇది అభినందించవలసిన విషయం. అయితే వీటి వల్ల ఈ ప్రాంతవాసులకు ఎటువంటి ఉపయోగం లేదు. ఒక్క రూపాయి ఆదాయం రాదు.. సరికదా స్థానిక యువతకు ఇక్కడ ఉపాధి దొరకడం లేదు. ఇదేంటిది.. బోలెడు ఇటుక బట్టీలు ఉండడం ఏమిటి.. స్థానికులకు ఉపాధి దొరక్కపోవడం ఏమిటని అనుకుంటున్నారా.. అవునండి బాబు.. ఈ బట్టీల్లో పనిచేసేందుకు కొందరు నిర్వాహకులు ఒడిశాలోని గిరిజన ప్రాంతాల నుంచి కూలీలను తెచ్చుకుని ఇక్కడ పనిచేయిస్తున్నారు. తక్కువ వేతనం ఇచ్చి వారిచే వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారు. బట్టీల వద్దే వారిని ఉంచి తమకు నచ్చినట్టు పనికానిస్తున్నారు. ఇటుకలను నిర్వాహకులు బాగానే విక్రయిస్తూ క్యాష్ చేసుకుంటున్నారు.

## ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్..

ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారిపై కేసులు వేయడం ఏమిటని అనుకుంటున్నారేమో.. ఇక్కడ లక్షల్లో టర్నోవర్ అవుతోంది. ఈ బట్టీల్లో వందల సంఖ్యలో కూలీలు పనిచేస్తున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్లు, లారీల్లో పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు ఇటుకలు తరలిపోతుంటాయి. జీవో 80 ప్రకారం పాఠశాల సమీపంలో బట్టీలు ఏర్పాటు చేయకూడదు, జీఎస్టీ చెల్లించాలి, పొల్యూషన్ బోర్డు అనుమతి ఉండాలి, ఇతర ప్రాంతాల నుంచి కార్మికులను తరలిస్తే అక్కడ అనుమతులు ఉండాలి. అయితే చాలా వరకూ ప్రభుత్వ నిబంధనలను నిర్వాహకులు కాలరాస్తున్నారు. బట్టీల నుంచి వస్తున్న పొగ వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. ఇవన్నీ బట్టీల యజమానులు పట్టించుకోవడం లేదు. అధికారులు సైతం ఇటుక బట్టీలే కదా అని అక్కడ పనిచేస్తున్న వారు పేద కూలీలే అని అనుకుంటున్నారు తప్ప నిర్వాహకులు నిబంధనలు పాటిస్తున్నారా? కూలీలకు భద్రత ఉందా? వాటిలో స్థానికులకు ఉపాధి దొరుకుతుందా లేదా అనేది పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తోంది. కొందరు అధికారులకు బట్టీల నిర్వాహకుల నుంచి ఆమ్యామ్యాలు అందడంతో ఇటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

## కోర్టులో పిటిషన్..

నిబంధనలు అతిక్రమించి ఇటుకబట్టీలు వేస్తున్న వారిపై ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బిర్లంగికి చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకుడు దూపాన సూర్యనారాయణ రెడ్డి కోర్టును ఆశ్రయించారు. ప్రతివాదులుగా కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మైన్స్ శాఖలను బాధ్యులుగా చేర్చుతూ పిటిషన్ దాఖలు చేశారు. 2022లో ఇచ్చిన లీగల్ నోటీసులు ప్రకారం అప్పటి కలెక్టర్, ఆర్డీవోకి, జిల్లా పంచాయతీ అధికారికి, జిల్లా పరిశ్రమల మేనేజర్‌కు, పొల్యూషన్ అధికారులకు, మైన్స్ అధికారులకు ఆదేశాలు ఇస్తూ నివేదిక తయారు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఆర్డీవో ఆదేశాలతో తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. అన్ని అనుమతి పత్రాలు సకాలంలో దాఖలు చేయాలన్నారు. హమ్మయ్య.. మా పని అయిపోయింది అని హ్యాపీగా సైలెంట్ అయిపోయారు.



# పండుగలా.. రథసప్తమి వేడుకలు చేద్దాం

✳ మూడు రోజుల పాటు పాటు వేడుకలు
✳ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దండి
✳ అందరి సహకారంతో విజయవంతం చేద్దాం
✳ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు
✳ ఫిబ్రవరి 2న శోభాయాత్ర, 3న సౌరయాగం
✳ డోనర్ పాసులకు 10లోగా దరఖాస్తు చేసుకోండి
✳ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
✳ జడ్పీలో ప్రజాభిప్రాయ సేకరణ



**శ్రీకాకుళం, జనవరి 2 (వార్త):** సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలు.. పండగ వాతావరణంలో నిర్వహిద్దాం.. దీనికి అందరూ సహకరించాలి.. అని శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం భక్తుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు గాను ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అరసవల్లి రథసప్తమి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీలలో రథసప్తమి వేడుకలు నిర్వహిస్తామన్నారు. 2న శోభా యాత్రతో ఉత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్రస్థాయి గ్రామీణ క్రీడా పోటీలు మునిసిపల్ హై స్కూల్ మైదానంలో ఏర్పాటు చేస్తామన్నారు. 3న దేవస్థానం ఆవరనలో సౌర యాగం ఉంటుందని తెలిపారు. ప్రతీ రోజు శ్రీకాకుళం జిల్లా చరిత్రతో కూడిన లేజర్ షో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మన దేవాలయాలు అభివృద్ధి చెందిన నాడే మనం అభివృద్ధి చెందుతామని చెప్పారు. శ్రీకూర్మం శ్వేత పుష్కరిణి ఆధునీకరణకు 10 కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు. భక్తులకు వినోదం కల్పించేందుకు డచ్ బిల్డింగ్ దగ్గర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెలికాప్టర్ ఏర్పాటు చేయనున్నామన్నారు. నగర సుందరీకరణకు సంబంధించి మున్సిపాలిటీకి రెండు కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. నిర్దేశిత సమయంలో ప్రోటోకాల్ పాస్‌లకు అనుమతించడం జరుగుతుంది. డోనర్ పాసులు కావలసిన వారు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతీ పాస్‌పై క్యూఆర్ కోడ్ ఉంటుందని తెలిపారు. ఉచిత దర్శనం క్యూ నిరంతరం కొనసాగుతుందన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించి రథసప్తమి వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. ముందుగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన వేడుకల్లో విధులు నిర్వహించిన అధికారులు, భక్తుల నుండి సలహాలు, సూచనలు తీసుకొని మరింత ఘనంగా వేడుకలు నిర్వహించాలనేదే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతీ సంవత్సరం ఒక్కరోజు కార్యక్రమాలు నిర్వహించడం జరిగేదని, ఈసారి మూడు రోజులు పాటు కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు 2లక్షల పై చిలుకు లడ్డులు ఆలయప్రాంగణంలో ప్రసాదం అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం వివిధ వర్గాల నుంచి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ అభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ఈఓ భద్రాజీ, మునిసిపల్ కమిషనర్ ప్రసాద్, జిల్లా గ్రామీణభివృద్ధి పథకం సంచాలకులు కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి వి.శ్రీధర్ రాజ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మూడో రోజు.. 214 మంది

✳ ఉత్సాహంగా పాల్గొంటున్న అభ్యర్థులు ✳ 3,4 తేదీల్లో మహిళ అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు ✳ మహిళా పోలీసు అధికారులతో ప్రత్యేక బందోబస్తు ✳ పర్యవేక్షించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

## తాబేళ్ల మృత్యువాత

✳ తీరానికి కొట్టుకువస్తున్న కళేబరాలు ✳ గుడ్లు పెట్టేందుకు తీరాలకు వస్తున్న తాబేళ్లు ✳ వలల బారిన పడి మృతి




లోపలి పేజీల్లో..

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కాశీబుగ్గ బీసీ హాస్టల్‌లో నాగుపాము కలకలం



**పలాస, జనవరి 2(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల కాశీబుగ్గ హాస్టల్‌లోకి నాగుపాము చొరపడి హల్‌చల్ చేసింది. పామును చూసిన విద్యార్థులు భయంతో బయటకు పరుగులు తీశారు. నాగుపాము హాస్టల్‌లో సంచరిస్తుండడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. హాస్టల్ వార్డెన్ ఉపేంద్ర కాశీబుగ్గ అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఈ సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, స్నేక్ క్యాచర్ హాస్టల్‌కు చేరుకున్నారు. పామును చాకచక్యంగా పట్టుకున్న స్నేక్ క్యాచర్ త్యాడి ఓంకార్ పలాస సమీపంలోని అటవీ ప్రాంతంలో దానిని విడిచిపెట్టారు.

# క్రీడా స్ఫూర్తిని చాటాలి

- క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి
- ఎమ్మెల్యే గొండు శంకర్
- ఘనంగా ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్




**శ్రీకాకుళం, జనవరి 2(వార్త):** ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ బాలుర కళాశాలలో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు జాతీయ పతాకంతో చేసిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ పేరిట జిల్లాలోని తొమ్మిది కళాశాలలు ఇక్కడ పోటీల్లో పాల్గొనడం జరుగుతోందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులతో సత్సంబంధాలు మెరుగుపడతాయని, తద్వారా ఒకరికొకరు సహాయ పడేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. టెక్నికల్ విద్యను అభ్యసించే వారిలో ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, ఇటువంటి క్రీడల్లో పాల్గొనడం ద్వారా వారిలో మానసిక ఒత్తిడి తగ్గి శారీరక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కూడా ప్రాధాన్యత కల్పిస్తోందని చెప్పారు. విద్యార్థులు తాము ఎంచుకున్న ఏ రంగంలోనైనా పట్టుదల, కృషితో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పురుషుల బాలికల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లు, పెద్ద ఎత్తున క్రీడాకారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## మహిళా సంఘాలూ.. మైక్రోఫైనాన్స్ సంస్థల ఉచ్చులో పడొద్దు

-ఏపీఎం కూర్మారావు



**మందస, జనవరి 2(వార్త):** మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు ఎట్టి పరిస్థితుల్లోనూ మైక్రో ఫైనాన్స్ సంస్థల వలలో పడవద్దని వెలుగు ఐటీడీఏ. అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. గురువారం ఆయన కొండలోగాం, కుసుమల పంచాయతీల్లో పర్యటించారు. టంగరాపుట్టి గ్రామంలో మహిళా సంఘాలతో సమావేశమై మాట్లాడారు. అక్కడ మహిళా సంఘాల స్థితిగతులు తెలుసుకొని కొద్దిమంది సభ్యులు వారి అత్యవసరాల మేరకు మైక్రో ఫైనాన్స్ సంస్థల బారిన పడి అధిక వడ్డీలు చెల్లిస్తున్న విషయం తెలుసుకొని అక్కడ పని చేస్తున్న సిబ్బందిపై మండిపడ్డారు. మహిళా సంఘాల్లో అంతర్గత అప్పులకు గతంలో బ్యాంకులు నిరాకరించడంతోనే, మైక్రో ఫైనాన్స్ సంస్థలు గ్రామాల్లో అప్పులు ఇస్తున్నాయని సిబ్బంది ద్వారా తెలుసుకొని అక్కడ నుంచే బ్యాంకు అధికారులకు ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం అన్ని బ్యాంకులు కూడా అంతర్గత అప్పులకు అవకాశం కల్పిస్తున్నందున సభ్యురాలి అవసరం మేరకు గ్రూపు తీర్మానం చేసి అప్పులు ఇప్పించాలని సిబ్బందికి ఆదేశించారు.

కార్యక్రమంలో ఎంఎంఎస్ డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామినాయుడు, వీవోఏలు జగబంధు, ఆనంద్, వన్ ధన్ వికాస కేంద్ర సభ్యులు, గ్రామ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించాలి



**మందస, జనవరి 2(వార్త):** రైస్ మిల్లు, జీడి పరిశ్రమల కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కారం చేయాలని, రైస్ మిల్లు యాజమాన్యాలు రైతులకు చేస్తున్న అక్రమాలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ మందసలో జీడి, రైస్ మిల్లు కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్, రైతు సంఘం నాయకుడు కె.హేమారావుచౌదరి తదితరులు మాట్లాడుతూ మందస మండలంలోని రైస్ మిల్లు యజమానులు అటు రైతులను, ఇటు కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. రైస్ మిల్లు కార్మికులు కూలీ రేట్లు పెంచమన్నప్పుడు మాత్రమే యాజమాన్యానికి అన్యాయం జరిగిపోయిందని గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. కానీ ఏడాది పొడవునా రైతులు, కార్మికులను దగా చేస్తూనే ఉన్నారన్నారు. జీడి పరిశ్రమల యాజమాన్యం కూడా రైతులనూ, కార్మికులనూ శ్రమ దోపిడీ చేస్తున్నారని, రెండేళ్లకు ఒకసారి జరగాల్సిన అగ్రిమెంట్ కాలపరిమితి పూర్తయి ఆరు నెలలు దాటినా పట్టించుకోవడం లేదని, కార్మిక చట్టాలు అమలు చేయకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారన్నారు. రైస్ మిల్లు కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కారం చేయాలని, జీడి కార్మికుల వేతన సవరణ వెంటనే జరిగేలా చర్యలు చేపట్టాలని, కార్మికులందరికీ డీఏ వంటి చట్టపరమైన హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ హైమావతికి అందజేశారు. కార్యక్రమంలో కార్మిక రైతుసంఘాల నాయకులు కె.బాలకృష్ణ, బి.మల్లేసు, కె.కృష్ణారావు, బి.వెంకటేశం, జి.బాల మ్మ, కె.శాంతమ్మ, బి.చంద్రమ్మ, సీహెచ్ జానకమ్మ, ఎం.దమయంతి, డి.లక్ష్మి, ధనం, రైతు ప్రతినిధులు బి.కామేశ్వరరావు, ఎం.మాధవరావు, జీడి, రైస్ మిల్లు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



**పలాస, జనవరి 2(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు ధీటుగా మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పలాస మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం కోరారు. కాశీబుగ్గ సాయి కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఎలా అమలవుతుందో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పలు అంశాలపై జిల్లా రీసోర్స్‌పర్సన్లు గౌరీ శంకర్, జె.సంతోష్, పైల పూర్ణారావు శిక్షణ ఇచ్చారు.

కార్యక్రమంలో సాయి కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్ చంద్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.చిన్నంనాయుడు, టి.హేమారావు, వీర్రాజు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజు, శివ, స్కూల్ కమిటీ చైర్మన్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## సైనికులకు సలాం...!

-ఉద్యోగ విరమణ చేసిన జవాన్లకు ఘన స్వాగతం

**మందస, జనవరి 2(వార్త):** ఉద్యోగ విరమణ చేసిన సైనికులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. మందస మండలంలోని కుంటికోట పంచాయతీ అచ్యుతాపురం గ్రామానికి చెందిన గొల్లపల్లి వెంకటరావు, గొల్లపల్లి శ్రీధర్ సైన్యంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. గురువారం సొంత గ్రామానికి వచ్చిన వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. జైజవాన్, జైకిసాన్, భారతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు సైన్యంలో పని చేసినప్పుడు తమ అనుభవాలను, జ్ఞాపకాలను అందరితో పంచుకున్నారు. కార్యక్రమంలో సైనికుల కుటుంబసభ్యులు, అచ్యుతాపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

## 108 సిబ్బందికి శిక్షణ తరగతులు



**పలాస, జనవరి 2(వార్త):** పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆవరణలో 108 సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా ఏఈఎంఎస్ పలాస ఈవో జగన్ పర్యవేక్షణలో ఓజేటీ నెయ్యిల కృష్ణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ గర్భిణులు ప్రసవ సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నవజాత శిశువుల కోసం, ప్రథమచికిత్స, ఎస్‌యూఆర్ డాక్యుమెంటేషన్ 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు వాటి ఉపయోగాలపై సమీక్షించారు. కార్యక్రమంలో పలాస డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఈఎంటీలు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావ సభకు రండి



**కొత్తూరు, జనవరి 2 (వార్త) :** హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల ఐదున విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు హాజరు కావాలని శ్రీకాకుళం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు కలమట వెంకటరమణ, కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసీవరప్రసాద్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు పొగిరి రవి, ముఖలింగం, సీహెచ్ రామానుజన్, పెదకోట యతిరాజు పాల్గొన్నారు.

## వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

**వంగర, జనవరి 2(వార్త):** వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని వంగర ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. గురువారం ఆయన వంగర రహదారిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్లు వినియోగం లేని వారికి జరిమానా తప్పదని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. వాహనాల నడిపేవారు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే పెద్దలపై చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని శంకర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**వంగర, జనవరి 2(వార్త):** సీతాదేవిపురం ఫీడర్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులతో శుక్రవారం సుమారుగా ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ వి.సాంబశివరావు తెలిపారు. వంగర మండలంలో మరువాడ, కె.మరువాడ, సీతాదేవిపురం, ఇరువాడ, చౌదరివలస, చంద్రంపేట గ్రామాల్లో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లు, కొమ్మలను తొలగిస్తామని పేర్కొన్నారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని చెప్పారు. దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.




## జాతీయ స్కేటింగ్ పోటీలకు చాంపియన్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

**పలాస, జనవరి 2(వార్త):** ఆంధ్రప్రదేశ్ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు తిరుపతిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో కాశీబుగ్గకు చెందిన 'చాంపియన్ స్కూల్' విద్యార్థులు మూడు పతకాలు కైవసం చేసుకున్నారు. పి.రాఘవి రిలే స్లో పోటీలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. అట్టాడ అయాన్ 200 మీటర్ల పోటీలో సిల్వర్ మెడల్ సాధించారు. ఎన్.పార్థసాయి 1000, 200 మీటర్లులో కాంస్యం సాధించారు. వీరు తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగే సెలెక్టెడ్ నేషనల్ చాంపియన్ షిప్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన సభకు పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బోర కృష్ణారావు (బుజ్జి) ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బోర శిరీష, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఎస్పీ గ్రీవెన్స్ నేడు రద్దు

**పలాస, జనవరి 2(వార్త):** కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం (మీకోసం) శుక్రవారం రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించి కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు రావద్దని సూచించారు.

## కేంద్ర మంత్రిని కలిసిన రెల్లి సామాజిక నేతలు



**శ్రీకాకుళం, జనవరి 2(వార్త):** నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు జాతీయ రెల్లి గ్రూపు కులాల జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ (మాస్టర్) శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అర్జి కోటి, జై గోవిందరావు, అర్జీ తిరుపతిరావు పాల్గొన్నారు.

## విరిగిన దండుగోపాలపురం రైల్వేగేట్



**సంతబొమ్మాళి, జనవరి 2(వార్త):** దండు గోపాలపురం రైల్వే గేట్ గురువారం విరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. సుమారు మూడు గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎంతసేపటికీ గేటు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఇరువైపులా ఉన్న వాహనదారులు టెక్కలి మీదుగా తమ గమ్యస్థానాలకు అతి కష్టం మీద చేరుకున్నారు. రాత్రి పూట కావడం, చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వచ్చింది.



## భూ సమస్యలు 45 రోజుల్లో పరిష్కరిస్తాం




**పలాస, జనవరి 2(వార్త):** భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేస్తే, 45 రోజుల్లో పరిష్కరిస్తామని పలాస తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. పలాస మండలం నీలిభద్ర గ్రామంలో రెవెన్యూ సదస్సుల పైలెట్ స్కీములో భాగంగా గురువారం రైతులతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలపై ఇప్పటికే చాలా ప్రాంతాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరికైనా సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వాయిలపల్లి సునంద, మండల సర్వేలు చంద్రశేఖర్, గిరి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఎం.సీతారాంపురంలో ..

**వంగర, జనవరి 2(వార్త):** ఎం.సీతారాంపురం గ్రామ సచివాలయంలో గురువారం తహసీల్దార్ డి ధర్మరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆ గ్రామ రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కి వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## విద్యార్థుల పట్ల బాధ్యతగా ఉండాలి : లోతుగడ్డ



**కొత్తూరు, జనవరి 2(వార్త):** కొత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (హైస్కూల్) గురువారం మండల విద్యా శాఖాధికారుల సహకారంతో స్కూల్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాద్‌రావు హాజరై, మాట్లాడారు. స్కూల్ కమిటీ చైర్మన్, ప్రభుత్వ ఉపాధ్యాయుల విధులు, బాధ్యతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేవారు నిరుపేద కుటుంబాల వారని, అటువంటి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వ బడులను ప్రైవేట్ స్కూళ్లతో పోటీ పడే విధంగా తయారు చేస్తున్నారని కొనియాడారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులు స్కూల్ పిల్లల కోసం భోజనం, పాఠ్య పుస్తకాలు, పాఠశాలలో సదుపాయాలు గురించి అడిగి తెలుసుకునే హక్కులు ఉన్నాయని చైర్మన్లకు తెలిపారు. స్కూల్ కమిటీ చైర్మన్లందరూ కూడా ఎంతో బాధ్యతతో బడులను అభివృద్ధి చేయడంలో తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాఠశాలల చైర్మన్లు పాల్గొన్నారు.

## అప్పులతో.. సంపద సృష్టిస్తున్న చంద్రబాబు




**-తాజాగా ఏపీఎండీసీ ద్వారా రూ.5000 కోట్ల రుణం**

**-ఆమదాలవలస వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్**

**ఆమదాలవలస, జనవరి2(వార్త):** సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ బీరాలు పలికి ఓట్లు దండుకున్న చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే లక్ష కోట్లు అప్పు చేశారని, తాజాగా ఏపీ ఎండీసీ ద్వారా 5000 కోట్లు అప్పు చేయడానికి కార్పొరేషన్‌కు అనుమతి మంజూరు చేశారని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఆరోపించారు. గురువారం ఆయన ఆమదాలవలసలోని వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో కార్పొరేషన్ల ద్వారా లక్షల కోట్లు అప్పులు తెచ్చారని ఊరూరా తిరిగి విష ప్రచారం చేసిన చంద్రబాబు... వారం రోజుల క్రితం ఆంధ్ర ప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా కనీ సం 5000 కోట్లు అప్పు చేయమని జీఓ నెంబర్ 97 ద్వారా అనుమతులు జారీచేశారన్నారు. ఇలా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టి, పేదవాడికి ఇచ్చిన హామీలను ఒక్కటికూడా నెరవేర్చకుండా ఈ డబ్బునంతా అమరావతిలో పెట్టి చంద్రబాబు తన రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు విజనరీ అని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని నమ్మిన మేధావులు, విద్యావంతులు ఇప్పటికైనా ఆయన మోసాన్ని అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు కొప్పుల ఈశ్వరరావు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీలే కీలకం




**మందస, జనవరి 2(వార్త):** ప్రభుత్వ పాఠశాలల సర్వతోముఖాభివృద్ధిలో యాజమాన్యం కమిటీలే కీలకపాత్ర వహిస్తాయని మండల విద్యాశాఖ అధికారి ఎం.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని 125 పాఠశాలల యాజమాన్యం కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయుల సమావేశం, పాఠశాల విద్యాకమిటీ విధులు-బాధ్యతలు అనే అంశంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం మందసలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం కమిటీ పాఠశాల పరిధిలో ఉండే అనేక సంస్థలపై దృష్టి సారించి, వాటిలో పాఠశాలను ఎన్‌రోల్‌మెంట్ పెంచడం, తల్లిదండ్రులతో మాట్లాడి బాలల హక్కుల పరిరక్షణ, యవ్వన దశపై అవగాహన లోపంతో ఆకర్షణ ద్వారా ఎదుర్కొనే ఇబ్బందులను పరిష్కరించే మార్గాలను వివరించారు. పాఠశాల విద్యార్థుల రక్షణ, పాఠశాల ఆస్తుల పరిరక్షణ, తల్లిదండ్రులు..పిల్లలతో ఎలా వ్యవహరించాలి, పాఠశాలలో ప్రభుత్వం చేపడుతున్న విద్య పథకాలపై డీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం, మధ్యాహ్న భోజనం పథకం పద్ధతులు, మెనూ ప్రకారం వంట చేసే విధానం తెలిపారు. బాలల హక్కులు పరిరక్షణకు ఎవరెవరు ఏం చేయాలో వివరించారు. లింగ వివక్షత, పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ, మనబడి బయట పిల్లలకు విద్య సదుపాయాలు కల్పించడం తమ బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీలు సార భాస్కరరావు, పురుషోత్తం, సీపాన సూర్యనారాయణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ హెడ్మాస్టర్ నగరి తారకేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, హరిపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమారాజు, కృష్ణమూర్తి, ఎర్రంనాయుడు పాల్గొని ప్రధానోపాధ్యాయులకు, పాఠశాల యాజమాన్యం కమిటీ చైర్మన్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రత్యేకంగా వమరవెల్లి డైట్ క్షేత్ర ఉపాధ్యాయులు, శిక్షణ పొందుతున్న విద్యార్థులు హాజరయ్యారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పాలిథిన్ సంచుల సీజ్

**శ్రీకాకుళం టౌన్, జనవరి 2 (వార్త):** శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో పొట్టి శ్రీరాములు మార్కెట్లో గురువారం ప్లాస్టిక్ రైడ్ జరిగింది. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డి సుధీర్‌కుమార్ 400 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. నిషేధిత పాలిథిన్ సంచులు వాడితే ఇకపై కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌వో హెచ్చరించారు.



# మూడో రోజు.. 214 మంది అర్హత

* ఉత్సాహంగా పాల్గొంటున్న అభ్యర్థులు
* 3,4 తేదీల్లో మహిళ అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు
* 6 నుంచి మళ్లీ పురుష అభ్యర్థులకు
* మహిళా పోలీసు అధికారులతో ప్రత్యేక బందోబస్తు
* పర్యవేక్షించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

**శ్రీకాకుళం క్రైం, జనవరి 2 (వార్త):** ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో గురువారం 3వ రోజు పోలీస్ రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలో 214 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. పోలీసు కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షలు ఛాతీ, ఎత్తు, 1600,100 పరుగు, లాంగ్ జంప్‌ను గురువారం నిర్వహించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఈ పరీక్షలు కొనసాగాయి. గురువారం 613 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 339 మంది పాల్గొన్నారు. వీరిలో 214 మంది అభ్యర్థులు దేహ దారుఢ్య పరీక్షలో ఉత్తీర్ణులు అయ్యారు. 3,4 తేదీల్లో మహిళ అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలను నిర్వహించనున్నారు. దీని కోసం ప్రత్యేకంగా మహిళ పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. కాల్ లెటర్‌లో తెలిపిన స్కోరు కార్డ్,స్టేజ్- 1 అప్లికేషన్, స్టేజ్-2అప్లికేషన్‌తోపాటుగా అన్ని ధృవీకరణ పత్రాలను, జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఎస్పీ సూచించారు. నోటిఫికేషన్ షెడ్యూల్ మేరకు సోమవారం నుంచి పురుష అభ్యర్థులకు యధావిధిగా నిర్దేశించిన తేదీలలో హాజరుకావాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

## కాశీబుగ్గ పీఎస్‌లో మీకోసం వాయిదా

ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు స్వీకరణ మరియు పరిష్కార కార్యక్రమం (మీకోసం) శుక్రవారం వాయిదా పడిందని ఎస్పీ తెలిపారు. పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ నిర్వహిస్తున్నందున ఈ కార్యక్రమం వాయిదా వేశామన్నారు.











# తాబేళ్ల మృత్యువాత

* తీరానికి కొట్టుకువస్తున్న కళేబరాలు
* గుడ్లు పెట్టేందుకు తీరాలకు వస్తున్న తాబేళ్లు
* వలల బారిన పడి మృతి



**పలాస, జనవరి2(వార్త):** బంగాళాఖాతంలో లోతైన అగాధాల్లో సంచరించే అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. వాటి కళేబరాలు సముద్ర తీరాలకు కొట్టుకువస్తున్నాయి. వీటిని చూసి తీర ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాబేళ్లు గుడ్లు పెట్టే సమయంలో ఒడ్డు పైకి వచ్చే క్రమంలో మరబోట్లు, భారీ షిప్‌లు, రింగు వలలబారిన పడి మృత్యువాత పడుతున్నాయి. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో రట్టి, టి.గంగువాడ, మంచినీళ్ల పేట సముద్ర తీరానికి వందలాది ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు రెండు రోజులుగా కొట్టుకువస్తున్నాయి. అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు సముద్ర కాలుష్యాన్ని నివారించి పర్యావరణ సమతుల్యత దెబ్బ తినకుండా పరిరక్షిస్తాయి. అయితే ఆలివ్ రిడ్లే తాబేళ్లు సంతానోత్పత్తికి ఏటా జనవరి, ఫిబ్రవరి నెల నుంచి జూన్ మొదటి వారం వరకు ఒడ్డు పైకి వచ్చి ఇసుక తిన్నెలపై బొరియలు తవ్వి గుడ్లు పెడతాయి. అనంతరం సముద్రంలోకి జారుకుంటాయి. చేపల వేటకు వెళ్లిన పెద్ద పెద్ద బోట్ల వలకు చిక్కి ఇవి మృత్యువాత పడుతున్నాయి. అటవీ శాఖాధికారులు స్పందించి తాబేళ్ల కళేబరాలను పూడ్చి పెట్టి పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక మత్స్యకారులు, పర్యాటకులు కోరుతున్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546